
# డబుల్ ట్రబుల్!

ఎమ్బీయస్ ప్రసాద్



selvaraaz

పశాంత్ పార్టనర్‌గా చేరిన మరుసటిరోజే రామచందర్ క్లయింటుగా రావడం నాకాశ్చర్యం కలిగించింది. అందునా ఆయనకేసు విన్నప్పుడు మరీ ఆశ్చర్యం కలిగింది.

అయనలాంటి వాడొకడు ఉన్నాడట. ఆయన ఆఫీసులోనూ, ఇంట్లోనూకూడా తిరుగుతున్నాడట. ఇప్పటిదాకా ఏ హానీ జరగకపోయినా అతనెవడో కనుక్కోవాలని ఆయన తాపత్రయం. కనిపెట్టమని మా డిటెక్టివ్ ఏజన్సీ దగ్గరికి వచ్చాడు.

"మీరు చూడబోతే ఇన్సూరెన్స్ కంపెనీలో పెద్ద ఆఫీసరు. మీ క్లెయిమ్స్ విషయంలో చాలా పెద్ద డిటెక్టివ్ ఏజెన్సీలతో సంబంధాలుంటాయి. మీరు మాలాంటి చిన్న కంపెనీ దగ్గరకు రావడం..." అని అర్థోక్తిలో ఆపాను.

రామచందర్ చిరునవ్వు నవ్వాడు. "అందరితో పరిచయాలు ఉంటాయి కాబట్టే వాళ్ల దగ్గరకి వెళ్లలేను. నాకు పిచ్చి ఎక్కిందనుకుంటారు. ఎందుకంటే నా డబుల్ ఇప్పటిదాకా ఏ నేరమూ చేయలేదు. ఉత్తిపుణ్యానికి ఎవడో నాలాంటివాడు నేను తిరిగిన ప్రతిచోటుకీ వస్తున్నాడని చెబితే వాళ్లు నమ్మరు. మీరైతే సీనియర్ డిటెక్టివ్. మీ ఏజెన్సీ చిన్నది కావచ్చు. కానీ మీరు అనుభవజ్ఞులు కాబట్టి..."

పొగడ్త ఎవర్నైనా ఉబ్బేస్తుంది. "సరే, మీ కేసు తీసుకుంటాను. మీరు అన్నీ వరుసలో చెప్పండి. మొట్టమొదటిసారి మీ డబుల్, సే అతని పేరు పరశురామ్ అనుకుందాం, అతని ఉనికి ఎలా తెలిసింది?"

"ఓసారి బొంబాయిలో హోటల్లో దిగాను. రిసెప్షనిస్టు 'నిన్ననే ఖాళీ చేసి వెళ్లారు కదా, మళ్లీ వచ్చారేం?' అన్నాడు. మతిపోయిందా అని నేను గొడవ పెట్టుకున్నా. అక్కడ పదిమంది సాక్ష్యం చెప్పారు నేను క్రితం రోజు అక్కడే ఉన్నానని. ఇంకేమంటాను? నోర్మూసుకున్నాను."

"తర్వాత? "

"ఇంకో నెల్లాళ్లకు, కాన్ఫరెన్స్‌కో దానికి వెళ్లాను. ఆ పరశురామ్ అంతకు ముందు అరగంట క్రితమే వచ్చి వెళ్లాడట. నా ఫ్రెండ్స్ అనేకమంది చూశారుకూడా. అందరూ పొరబడ్డారు. ఇంతాచేసి అతను వచ్చి సాధించినది ఏమీ లేదు."

"సాధించడం అంటే? "

"అదే, ఏదో పుస్తకాలు, పేపర్లు పట్టుకెళ్లడం కానీ, అలాంటిది ఏమీ చేయలేదు. మా ఆఫీసుకు కూడా వచ్చాడు పదిరోజుల క్రితం. లంచ్‌టైములో. నా సెక్రటరీ చూసింది. నా క్యాబిన్‌లోకి వెళ్లాడు. కాస్సేపు ఉన్నాడు. ఎవరితో మాట్లాడకుండా వెళ్లిపోయాడు."

"పోలీసులకు చెప్పలేదా?"

"ఏమైనా పోతే, ఏదైనా నేరం జరిగితే చెప్పవచ్చు. సొమ్మొకడిది, సోకొకడిది సినిమాలోలా ఇంపోస్టర్ వచ్చి తప్పుడు ప్రిస్క్రిప్షన్లు రాసేస్తే పట్టుకోవచ్చు. ఇక్కడ అదేం జరగలేదుగా!"

"మరి మీరిక్కడకి రావటం దేనికి? ఈ మధ్య ఏమైనా అయిందా? "

"అవును, మొన్న మా ఆవిడ సునీలకు ఆ పరశురాముడు కనబడ్డాడు. కారు గరాజ్‌లో. నేను ఆఫీసుకు వెళ్లిపోయాక..."

"ఏమైనా మాట్లాడాడా? "

"ఆఫీసుకు వెళ్లలేదా అని అడిగితే, బ్రీఫ్‌కేసు మర్చిపోయానంటూ ఏదో గొణిగాడట. తను సరిగ్గా చూసేలోపున వెళ్లిపోయాడట. మా ఆవిడ తర్వాత నాకు ఫోన్ చేసి అడిగింది 'ఆర్యూ ఆల్‌రైట్?' అంటూ. దాంతో పాత కథలన్నీ చెప్పాల్సివచ్చింది. అక్కణ్ణుంచి పట్టుబట్టింది వెంటనే వెళ్లి డిటెక్టివ్‌ల నెవరినైనా చూడమని. మా ఫామిలీ ఫ్రెండ్ సుశాంత్ ఇక్కడ చేరాడంటే సరేనని ఇక్కడికి వచ్చాను."

"అదా సంగతి! నిజానికి నాకూ తమాషాగానే ఉంది. నిన్ననే సుశాంత్ వచ్చి నా వ్యాపారంలో పార్టనర్ అవుతానంటే ఆశ్చర్యపడ్డాను. 'నీలాంటి డబ్బున్న కుర్రాడికి ఎందుకొచ్చిన కష్టాలయ్యా అని చెప్పినా వినలేదు. నాది పెద్ద లాభసాటి వ్యాపారం కాదయ్యా అన్నా వినలేదు. ఉద్యోగం ఇవ్వలేనంటే అయితే పార్టనర్‌ని అవుతా'నంటూ తయారయ్యాడు."

"నిజానికి రామచందర్ అంకులే ఐడియా ఇచ్చారు. 'లా చదివావు కాబట్టి, డిటెక్షన్ నేర్చుకుంటే వృత్తికి మంచిది' అని. పెద్ద కంపెనీవాళ్లు నాలాంటివాడిని చేర్చుకోరు. మీరు కాబట్టి ఒప్పుకున్నారు!" అన్నాడు సుశాంత్ వినయంగా.

నాకు అతనిలో అదే నచ్చింది. నాకు పిల్లలు లేకపోవడం వల్లనో ఏమో అతన్ని చూడగానే స్వంతకొడుకుని చూసినట్టు ఫీలయ్యాను. నాకు వచ్చిన విద్య అంతా అతనికి నేర్పాలని నిన్ననే నిశ్చయించుకున్నాను. అతనికి తెలియకుండా అతనికి గన్‌లైసెన్స్ కోసం అప్లై చేసేశాను. వచ్చే నెలలో అతని పుట్టినరోజట. ఆ రోజుకి సర్‌ప్రైజ్ గిఫ్ట్‌గా ఇవ్వాలని నా ప్లాను. ఆచూకీ తీస్తామని హామీ ఇచ్చి రామచందర్ని పంపించేశాక సుశాంత్‌ని అడిగాను

"ఈయన మీ ఫామిలీ ఫ్రెండా? అంటే మీ నాన్నగారి..."

"అబ్బే, అలాక్కాదు. నాకే పరిచయం. అదికూడా తమాషాగా జరిగింది. ఒకసారి సూపర్‌బజార్‌లో ఒకావిడ పర్సు పారేసుకుంటే వెతికి ఇచ్చాను. ఆవిడ సంతోషించి వాళ్లింటికి రమ్మని ఆహ్వానించి భర్తను పరిచయం చేసింది. ఆవిడే సునీల. ఈయన భార్య అన్నమాట..."

"ఓహో... ఎన్నాళ్ల పరిచయం? "

"మూడు నాలుగు నెలలయిందనుకుంటా."

సునీలను కలవడానికి మేం ఇద్దరం వెళ్లినప్పుడు ఆమె, సుశాంత్ ఒకరినొకరు చూసుకున్న చూపులు గమనిస్తే వాళ్ల పరిచయం ఇంకా పాతదనిపించింది.

"ఎలా వుంది సుశాంత్, కొత్తవ్యాపకం?" అంది చిరునవ్వులు చిందిస్తూ.

"ఏదండీ, ఇంకా గట్టిగా మొదలే కాలేదు. వస్తూనే మీ కేసే అప్పగించారు నాకు పరంధామ్‌గారు!" అన్నాడు సుశాంత్ ఆమెను చూసి హాయిగా నవ్వుతూ.

"అంకుల్‌కి కవలలు ఎవరూ లేరన్నారు. మరి ఆయనలాంటివాళ్లు ఉండటం ఎలా సాధ్యం? అనుకున్నాం."

"ఇదేమైనా సినిమా కథ అనుకున్నావా? కవలలు చిన్నప్పుడు జాతరలో తప్పిపోవడానికి."

"అందుకే నేను ఘోస్ట్‌ల గురించి మాట్లాడితే పరంధామ్‌గారు అవేమీ లేవంటున్నారు."

నేను సుశాంత్ భుజం తట్టాను. "దెయ్యాల ఐడియా పక్కనబెట్టి, బుర్రపెట్టి ఆలోచించు. సునీలగారూ! మీ వారి ఆరోగ్యం ఎలా ఉంటుంది?" అన్నాను.

## మరోసారి సంజూ దౌర్జన్యం!

లండన్‌లోని ఓ హోటల్‌లో సుస్మితాసేన్, సంజయ్‌దత్ కలిసి చాలా క్లోజ్‌గా కనబడితే ఓ చిలిపి ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీయాలని ఉబలాటపడి పాపం, సంజూ చేతిలో దెబ్బలు తినడమే కాకుండా ఖరీదైన కెమెరాను కూడా కోల్పోయాట్ట. లండన్‌లో ఓ స్టేజీ షో చేయడానికి వెళ్లిన సుస్మిత, సంజూల ప్రణయాన్ని హాట్‌న్యూస్‌గా పేపర్లకిస్తే బాగానేవుంటుంది కానీ, అసలే సంజూ కోపిష్టివాడు. పైగా ఇంతదాకా భార్య చెంగుమాత్రమే పట్టుకుతిరిగినవాడన్న పేరు కూడా వుంది. అందుకు విరుద్ధంగా తన పేరు పత్రికలకెక్కితే... ఇంకేమైనా వుందా? అందుకనే సంజూ ఫోటోగ్రాఫర్‌ను కొట్టి కెమేరాను ధ్వంసం చేశాట్ట. కానీ ఆ తరువాత సంజూ మిత్రులంతా చేరి అతన్ని వెంటనే ఇండియా వెళ్లే ఫ్లయిట్ ఎక్కించేశార్ట. మరింతే సంగతులు!

ఎన్.



ఆమె చురుకైనది. "బ్రహ్మాండంగా ఉంది. ఎటువంటి హెల్యూసినేషన్స్ లేవు ఆయనకి. నేను నా కళ్లతో చూశాను కదా! ఆ వ్యక్తి, పరశురామ్ అని పేరు పెట్టారటగా మీరు. అతను గరాజ్‌లో తచ్చాడుతున్నాడు. నేనడిగితే ఏదో గొణిగాడు."

"గరాజ్‌లో కారుందా?"

"లేదు. మాకున్నది ఒకటే కారు. అది ఆయన వేసుకుని ఆఫీసుకి వెళ్లిన కొద్దిసేపటికి ఇతను కనబడ్డాడు. గరాజ్‌లో కారు లేదు. రోడ్డుమీద ఆపి, బ్రీఫ్‌కేసుకోసం వచ్చారేమో అనుకున్నాను. తర్వాత రోడ్డుమీద కారు కనబడలేదు. అతను నడుచుకుంటూ వెళ్లిపోయాడు. దాంతో నాకు అనుమానం వచ్చింది. ఆఫీసుకి ఫోన్‌చేసి అడిగాను."

"అదంతా చెప్పారులెండి. మీ ఇద్దరి వయస్సుల్లో చాలా తేడా ఉన్నట్టుంది. యూ సీమ్ టు బీ వెరీ యంగ్!" అన్నాను ఆమెను పరీక్షగా చూస్తూ. ఆమె పొంగిపోయింది.

"అఫ్‌కోర్స్, ఐయామ్ యంగ్! మా వారి మొదటి వివాహం ఫెయిలైంది. విడాకులు ఇచ్చి ఆవిణ్ణి వదిలించుకున్న మూడేళ్లకు మా పెళ్లి అయింది. మహాతల్లి ఈయన్ని పీడించి బాగానే రాబట్టింది. మామధ్య పదిహేనేళ్ల గాప్ ఉన్నా, అలా అనిపించదు. మీలాంటి డిటెక్టివ్‌లకు తప్ప!"

"నిజానికి నాకూ తెలియదు ఈ విషయం!" అన్నాడు సుశాంత్ తెల్లబోతూ.

"నీకింకా అనుభవం రావాలిలే. అడగడానికి నీకేమీ ప్రశ్నలు లేవా?" అందామె అతన్ని గోముగా చూస్తూ.

ఆ తర్వాత సెక్రటరీని అడిగి చూశాం. రామచందర్ వేసుకునే గళ్ల స్వెట్టర్ అతనూ, అంటే పరశురామ్ వేసుకోవడం వల్ల కన్‌ఫ్యూజ్ అయ్యానని చెప్పిందామె. ఆమెతో ఏమీ మాట్లాడలేదట. అందుచేత వాయిస్ వినలేదు. ఇంక చేసేదేమీ లేక రామచందర్ ప్రోగ్రామ్‌లు అడిగి తెలుసుకుని అతని వెళ్లిన ప్రతిచోటుకీ సుశాంత్‌ని వెళ్లమని, నీడలా వెంటాడమనీ చెప్పాను.

ఇరవై రోజులైనా కేసు అంగుళం కూడా ముందుకు కదలలేదు. సుశాంత్ విసుక్కోవడం మొదలెట్టాడు. ఆ పరశురామదర్శనం కానందుకు. వినీ వినీ అతని పుట్టినరోజున రివాల్వర్ బహుమతిగా ఇస్తూ చెప్పాను డిటెక్టివ్ పని అంటే సినిమాల్లో చూపించినట్టు గ్లామరస్‌గా ఉండదనీ, కావాలంటే నా కంపెనీలో పెట్టిన పెట్టుబడి వెనక్కి తీసేసుకుని వేరే వ్యాపారం చేసుకోమని. మా నాన్న కంటిన్యూ అవమన్నాడు అతడు సుశాంత్.

"ఇవేళ సాయంత్రం క్లబ్ మీటింగు ఒకటి ఉంది. అక్కడికైనా ఆ పరశురామ్ వస్తాడేమోనని ఆశ!" అన్నాడు.

"చూద్దాం, ఇవాళ నేను రామచందర్ జిఎమ్‌ని కలవబోతున్నాను. ఆయనతో మాట్లాడాక విషయం కాస్త అర్థమవుతుందేమో! మధ్యాహ్నం ఆఫీసుకి రా, చెప్తా!" అన్నాను.

నాకేం కావాలో జిఎమ్‌గారికి అర్థంకాలేదు. నిజానికి నాకూ తెలియదు, ఏం అడగాలో. రామచందర్ ఉద్యోగవిధుల గురించి అడిగాను, ఎలాంటి వాడని అడిగాను. "అతనికేం? ఫస్ట్‌క్లాస్ పెర్సన్. కంపెనీ ఆర్థిక వ్యవహారాలన్నీ అతని చేతిలోనే ఉంటాయి. చాలా చక్కగా నిర్వహిస్తాడు. ఎక్కడెక్కడ ఏ షేర్లలో పెట్టుబడి పెట్టాలో అతనికి తెలిసినట్టు ఇంకెవరికీ తెలియదు. మనిషి చాలా నిజాయితీపరుడు."

"మరి అతని సంతకం ఎవరైనా ఫోర్జరీ చేస్తే...? " అడిగాను.

ఆయన ఉలిక్కిపడ్డాడు. "ఎవరైనా చేస్తున్నారా? అలా అయితే కొంప మునిగినట్టే!"

అలాంటిదేమీ లేదని ఉత్తినే అడిగానని చెప్పి బయటపడ్డాను. వెళ్లి ఆఫీసుకు వెళ్లి కూర్చున్నాను. రామచందర్ అఫీషియల్ పొజిషన్ బట్టి, ఈ కేసు చాలా ముఖ్యమైనదని అనిపించింది. సుశాంత్ రాలేదు సరికదా ఫోను కూడా లేదు. చూసి చూసీ ఇంటికెళ్లి పడుకున్నాక రాత్రి పదిగంటలకు ఫోన్ వచ్చింది.

"పరంధామ్‌గారూ, గడబిడ అయిపోయింది. రామచందర్‌గారిని ఎవరో కాల్చేశారు. మీరు వెంటనే ఇక్కడికి రావాలి!" సుశాంత్ హడావుడి పడుతున్నాడు.

"ఇక్కడ అంటే ఎక్కడ? అసలు నువ్వెక్కడున్నావ్? మధ్యాహ్నం నుంచీ కాల్ చేయలేదేం? "

"సాయంత్రం క్లబ్ మీటింగు ఉందన్నానుగా ఒపేరా హోటల్లో. అక్కడనుంచే మాట్లాడుతున్నాను. శవం ఇక్కడే, పార్కింగ్ లాట్‌లో ఉంది. పోలీసులను కూడా పిలిచాను."

నేను వెళ్లేసరికి పోలీసు ఇన్‌స్పెక్టర్ కనబడ్డాడు. "ఈయన నీ క్లయింటా? వాళ్ల ఆవిడను పిలిచాం శవం గుర్తుపట్టడానికి. ఆవిడ తన కారులో ఇరవై నిమిషాలలో వస్తానంది."

"నా అసిస్టెంటు సుశాంత్ ఏడీ? "

"ఆ కుర్రాడా? అతను చెప్పేదేమిటంటే, అతను బయట తన కారులో రామచందర్‌కోసం వెయిట్ చేస్తున్నాట్ట. రామచందర్ మీటింగు మధ్యలోనే లేచి వెళ్లిపోయాడట. సుశాంత్‌కి అతను కనబడలేదట కానీ తుపాకీ చప్పుడు వినబడిందట. పరుగెత్తుకెళ్లి చూస్తే పార్కింగ్ లాట్‌లో రెండు కార్ల మధ్య అతని శవం పడివుందట!"

నేను వెళ్లేసరికి సుశాంత్ ఏడుస్తున్నాడు. "నేను డిటెక్టివ్‌గా పనికిరాను, సార్! నాకప్పగించిన ఫస్టుకేసే తగలేశాను!" అంటూ. అతన్ని ఓదార్చి వివరాలు అడిగాను. స్టెప్ బై స్టెప్ చెప్పమన్నాను. ముందుగా మధ్యాహ్నం ఎందుకు కలవలేదో చెప్పమన్నాను. నీళ్లు నమిలాడు.

"రామచందర్‌గారి ఇంటికెళ్లాను కొత్త సమాచారం ఏదైనా తెలుస్తుందేమోనని..." అన్నాడు తలవంచుకుని. నా కళ్లముందు బర్త్‌డే సూట్‌లో సుశాంత్‌కి బర్త్‌డే గిఫ్ట్ ఇస్తున్న సునీల మెదిలింది. నిట్టూర్చాను. అంత ఆనందంలో తేలివచ్చి కారులో కునికిపాట్లు పడే సుశాంత్‌కి రామచందర్ వచ్చినదీ, వెళ్లినదీ తెలుస్తుందా అని సందేహం కలిగింది.


"రామచందర్ని ఆఖరిసారి సజీవంగా ఎప్పుడు చూశావు?"

## తెలివైన ప్రియురాలు!

ఇంకెవరో కాదు, నేటి యువహీరో హృతిక్‌రోషన్ ప్రియురాలు సూజానేఖాన్. హృతిక్‌రోషన్ అందరితోటీ కలిసిమెలిసివుంటూ అందరినీ స్నేహితులుగా చేసుకుంటుంటే, సూజానే, తన కాబోయేభర్త నటించిన చిత్రాల్లోని హీరోయిన్లందరినీ పరిచయం చేసుకుంటూందట. అలా చేయడంవల్ల ఎవరితోనైనా హృతిక్ భవిష్యత్తులో పిచ్చివేషాలు వేసేందుకు ఎంతమాత్రం వీలుండదని సూజానే అభిప్రాయం కాబోలు! అయినా ఇప్పటివరకూ 'హృతిక్ మంచిబాలుడు' అనిపించుకుంటున్నాడు.

చూద్దాం... చూద్దాం...!

ఎన్.



"ఆయన మీటింగుకి వెళ్లినప్పుడే. తిరిగి రావడం చూడనేలేదు. అసలు రామచందర్ వచ్చేముందే నేను మీటింగ్‌కి వచ్చి అంతా వెతికాను. ఆ డబుల్ ఎక్కడా కనబడలేదు. రామచందర్ కారు పార్క్ చేసి లోపలికి వెళ్లాక కార్లో కూర్చుని పాటలు వింటూ కూర్చున్నాను. పదిగంటల దాకా మీటింగు ఉందని నాకు తెలుసు. మీటింగు స్టార్టయ్యాక పార్కింగ్‌కి ఎవరూ వచ్చినట్టు చూడలేదు. మీటింగ్‌కి వెళ్లేటప్పుడు రామచందర్ మెయిన్ డోర్‌లోంచి వెళ్లాడు కాబట్టి అదే గుమ్మంలోంచి బయటకు వస్తాడనుకున్నాను. కానీ ఆయన సైడ్ డోరులోంచి వచ్చాడు. ఇదేమిట్రా అనుకుంటూండగానే తుపాకి చప్పుడు వినబడింది. పరుగెత్తుకుని వెళ్లి చూస్తే కార్ల మధ్య శవం!"

"వేరే ఎవరూ లేరా? "

"లేరు. అంతా వెతికినాకనే మీకూ, పోలీసులకూ ఫోన్ చేశా!"

"సుశాంత్! నీ తుపాకీ ఓసారి చూడనీ!"

అతను కంగారుపడ్డాడు, "ఎందుకు సార్? " అంటూ.

"చూడు, నాయనా! నువ్వు ముందు చెప్పినదేమిటి? రామచందర్ లోపలికి వెళ్లిన తర్వాత మళ్లీ చూడలేదని. కాస్సేపటికి అదే నోటితో సైడ్ డోర్‌లోంచి బయటకు వచ్చాడని చెప్పావు. ఏది నమ్మాలి?"

సుశాంత్ మారు మాట్లాడకుండా తుపాకీ నాచేత పెట్టాడు. అప్పుడే కాల్చిన వాసన. నేను భయపడినట్టే ఒక గుండు లేదు.

"సునీలకోసమేనా? మీ ఇద్దరూ కలిసి వేసిన ప్లాను కదూ? తుపాకీ చేతికి రాగానే నువ్వు చేసినది డిటెక్షన్ కాదు, కోల్డ్ బ్లడెడ్ మర్డర్!" అన్నాను కోపంగా.

సుశాంత్ చివ్వున తలయెత్తాడు. "దీనిలో ఆమె ప్రమేయం లేదు. నిజం చెబుతాను. నమ్మితే నమ్మండి, లేకపోతే లేదు. ఇవాళ ఆమె, నేను కలిసి... యూ నో వాట్, ఆ మాట నిజం! బట్ దీసీజ్ నాట్ ఫస్ట్ టైమ్. ఇవాళ నా బర్త్‌డే స్పెషల్ అంతే. ఇక రామచందర్ సంగతి అంటారా, అతను మీటింగు లోపలికి వెళ్లడం నిజం. మీటింగు పూర్తవడానికి అరగంట ముందే అతను బయటకు వచ్చాడు. సైడ్ డోర్ నుండి. నేను పిలిచాను, ఏమండోయ్ అని. అతడు రామచందరో, పరశురామో తేల్చుకుందామని. అతను వెనక్కి తిరిగి చూసి, త్వరత్వరగా వెళ్లిపోసాగాడు. నేను వెంటపడడంతో తుపాకీ బయటకు లాగి బెదిరించాడు. అతని దగ్గర తుపాకీ చూసి నేను భయపడ్డాను. నేనూ రివాల్వర్ బయటకు తీసి దడిపించబోయి కాల్చేశాను. అవుటాఫ్ షియర్ పానిక్! దురుద్దేశమేమీ లేదు."

"మరి ఇదంతా పోలీసుల కెందుకూ చెప్పలేదు? "

"ఎందుకంటే నేను చంపినది పరశురామ్ కాదనీ, రామచందర్ అనీ జేబులో ఐడెంటిటీ కార్డు చూడగానే తెలిసింది. తెలియగానే నేను చేసిన పొరబాటు తెలిసింది. పైగా అతని శవం దగ్గర అతని తుపాకీ కనబడలేదు. దాంతో నేనేం చెప్పినా నమ్మరని పోలీసులకు ఏమీ చెప్పలేదు. కానీ మీలాంటి అనుభవజ్ఞులకు అన్నీ తెలిసిపోతాయి."

సుశాంత్ తండ్రికి ఫోన్ చేసి జరిగినది చెప్పాను. పోలీసులకు కూడా. కుర్రాడి దూకుడు వల్లనే ఇదంతా జరిగింది కానీ కావాలని చేయలేదనీ, కాస్త మెత్తగా వ్యవహరించమనీ కోరాను.

మర్నాడు మధ్యాహ్నం దాకా నేను నిద్రపోతూనే ఉన్నాను. కలలనిండా సుశాంతే! అమాయకమైన అతని మొహమే! ఏదో, ఎక్కడో మిస్సవుతోంది. రామచందర్ తుపాకీ ఎందుకు తీశాడు? అది ఏమైంది? లేక అతను పరశురామా? సుశాంత్‌వంటి ఫామిలీ ఫ్రెండ్‌కి కూడా మాటబట్టి తెలియదా? తెలియనట్టే అనుకోవాలి. ఆ మాటకొస్తే సునీలకూడా గరాజ్‌లో కనబడినప్పుడు కనిపెట్టలేకపోయింది కదా! సెక్రటరీ కూడా... నో... సెక్రటరీతో అతను మాట్లాడలేదు. అతనిలాంటి బట్టలు వేసుకోవడం వల్ల ... బట్ హౌ ఈజ్ ఇట్ పాజిబుల్?

అరగంటలోపున సునీల కెదురుగా నిలిచాను. పోయినది భర్తా, లేక ఈవిడేనా అనిపించింది ఆవిణ్ణి చూడగానే. నన్ను చూడగానే ఉలిక్కిపడింది. "జరిగింది చాలదా? " అని అక్కసుగా అరిచింది కూడా. "సుశాంత్ ఇంతకు తెగిస్తాడని అనుకోలేదు. మాకు హెల్ప్ చేస్తానంటూ నిన్న మధ్యాహ్నం కూడా వచ్చాడు. ఇదేనా సహాయం? "

"మేడమ్! కూల్‌డౌన్. పొరబాటుగా జరిగిన వ్యవహారం అది. రామచందర్‌గారు పోయారు కానీ, పరశురామ్ విషయం తేలలేదు...!" అని చెప్పబోతూ ఉండగానే ఆమె కట్‌చేసింది.


"ఇప్పుడిక అది అనవసరం. మీ ఛార్జీలెంత అయ్యాయో చెప్పండి, డబ్బిచ్చేస్తా!" అంటూ.

"అది అంత సింపుల్‌గా పోయే వ్యవహారం కాదు. సుశాంత్ జైల్లో ఇరుక్కుపోయాడు కాబట్టే దాని గురించి ఆలోచించాల్సిందే. ఆలోచించి చూస్తే రామచందర్, పరశురామ్ ఇద్దరూ రామచందర్ అవతారాలే అని తోచింది!" అన్నాను ఆమె కళ్లల్లోకి లోతుగా చూస్తూ.

"మీరు మాట్లాడేది నాకు ఒక్కముక్క కూడా అర్థం కావటంలేదు!" అందామె నిబ్బరంగా.

"మీకు అర్థమయ్యేట్లు చెప్తానుండండి. రామచందర్ విడాకులు తీసుకున్నప్పుడు మొదటి భార్యకు చాలా డబ్బు ముట్టజెప్పవలసి వచ్చిందని మీరే అన్నారు. నిజాయితీపరుడైన అధికారికి అంత డబ్బెక్కడిది? అప్పు చేసి ఉంటాడు. అది తీర్చుకోవడానికి కంపెనీ డబ్బు గోల్‌మాల్ చేసి ఉంటాడు. అది కప్పిపుచ్చుకోవడానికి ఒక డబుల్‌ని తనే సృష్టించాడు. జ్యూయల్ థీఫ్ సినిమాలో దేవానంద్ డబుల్‌ని కల్పిస్తారు చూడండి, అలాగేనన్నమాట. వాడు ఎక్కడెక్కడో కనబడ్డట్టు కొన్ని సాక్ష్యాలు సృష్టించాడు. ఒక చిన్న, కోన్‌కిస్కాయ్ డిటెక్టివ్ ఏజెన్సీని నియమించి వాళ్ల ద్వారా పరశురామ్ ఉన్నాడని నిరూపిస్తే వాడే తన సంతకం ఫోర్జరీ చేసి, డబ్బు కొట్టేశాడని, తన సహచరులను కూడా మభ్యపెట్టి తప్పుడు ఆర్డర్లు ఇచ్చాడని బుకాయించవచ్చు. తను చేసిన పాపం వాడిమీద కొట్టుకుపోతుంది!"

"కథ బావుంది!" అందామె పేలవంగా నవ్వి.



"ఇంకా బావుంటుంది వినండి. నిన్నరాత్రి క్లబ్ మీటింగు ఒక ముఖ్యమైన ఘట్టం. సుశాంత్‌లాంటి అనుభవశూన్యుడైన కొత్త డిటెక్టివ్ కంటికి పరశురామ్ కనబడితే, అతని ఉనికిని సుశాంత్ సర్టిఫై చేస్తాడు. ఎందుకంటే రామచందర్ అయితే పారిపోడు, తుపాకీ తీయడు. పారిపోతూ తుపాకీ చూపి బెదిరించాడు కాబట్టి, అతను పరశురామ్ అని లెక్క. రామచందర్ లెక్క తప్పిందెక్కడంటే సుశాంత్ నెర్వస్‌గా ఉంటాడనీ, అతనికి నేను తుపాకీ బహుమతిగా ఇచ్చి ఉంటాననీ ఊహించకపోవడం!"

"ఈ కట్టుకథకు ఆధారం ఏమిటండీ? "

"సింపుల్ లాజిక్. పరశురామ్ మీతో మాట్లాడినా మీరతని గొంతు గుర్తుపట్టలేదంటున్నారు. స్వంత భార్యనే ఫూల్ చేయగలిగినవాడు సెక్రటరీని కూడా ఫూల్ చేయవచ్చు. కానీ అతను సెక్రటరీతో మాట్లాడలేదు. ఏవో కాగితాలు చూసుకుని వెళ్లిపోయాడు. సెక్రటరీ చెప్పిన మరో విషయం గమనించాలి. పరశురామ్ రామచందర్ బట్టలే, అదీ ఆ రోజున రామచందర్ ఆఫీసుకి వేసుకొచ్చిన బట్టలే వేసుకున్నాడు. మీకు గరాజ్‌లో కనబడినప్పుడు కూడా అలాగే జరిగి ఉండాలి. కానీ ఇదెలా సాధ్యం? డబుల్ అంటే రూపవిలాసాలలో పోలిక ఉండవచ్చు. కానీ ఒరిజనల్ ఏ రోజు ఏ బట్టలు వేసుకుంటాడో ముందే ఊహించి, అవే బట్టలు వేసుకోవడం ఇంపాజిబుల్!"

"మరి హోటల్లోనూ, కాన్ఫరెన్స్ దగ్గరా? "

"అవి ఫేక్ చేయడం అతి సులభం. రమచందరే కావాలని ఫస్ చేయవచ్చు. నేను ఇంతకుముందు రాలేదు అంటూ."

సునీల భుజాలెగరేసింది. "ఆయన మొదటి పెళ్లి కాదు కానీ ఇంత ముప్పు వచ్చిపడింది. ఏది ఏమైనా నాకీ గొడవతో సంబంధం లేదు. నాకు ఇవేవీ అసలు తెలియదు!"

"మీకూ ఈ కుట్రలో భాగం ఉంది. సునీలగారూ! నిన్న రాత్రి డ్రామాలో మీదీ ఓ పాత్ర ఉంది. సుశాంత్ మీ ఆయన్ని కాలుస్తూండగా మీరు అక్కడే ఉన్నారు!"

"మీకేమైనా మతిపోయిందా? " అంటూ అరిచిందామె.

"మతి ఉంది కాబట్టే గుర్తుకువచ్చింది. మీకు ఒక కారే ఉందనీ, రామచందర్ మీ కార్లో మీటింగ్‌కు రావడం, కారు అక్కడ పార్కు చేయడం సుశాంత్ చూశాడు. ఆయన పోయిన తర్వాత పోలీసులు వచ్చినప్పుడు ఆ కారు అక్కడే ఉండాలిగా. కానీ లేదు. ఆయన శవాన్ని గుర్తుపట్టడానికి మీరు మీ కారులో వచ్చారు. ఇప్పుడు కూడా ఆ కారు మీ గరాజ్‌లో ఉంది. అంటే ఆ హత్య తర్వాత ఆ కారుని మీరు వెనక్కి తీసుకొచ్చాశారన్నమాట!"

"అదీ..." అంటూ ఆమె తత్తరపడింది.

"ఇంకో విషయం... సుశాంత్ చెప్పినదాని ప్రకారం రామచందర్ చేతిలో గన్ ఉందన్నాడు. కానీ పోలీసులు వెళ్లి చూసేసరికి శవం పక్కన అది దొరకలేదు. అది కనబడకపోవడంతో కంగారుపడి సుశాంత్ అబద్ధాలు చెప్పనారంభించాడు. నా అనుమానం మీరు పక్కనుండి అంతా చూసి సుశాంత్ మాకు ఫోన్ చేయడానికి రాగానే ఆ పిస్తోలు తీసుకుని, మీ కారులో ఉడాయించారు. ఆటోలో వస్తే దరిమిలా ఎంక్వైరీ జరిగితే వాడు సాక్ష్యం చెబుతాడని భయపడ్డారు. పైగా పోలీసులు మీ కోసం ఫోన్ చేసేటప్పటికి మీరు ఇంట్లో ఉండితీరాలి. లేకపోతే మీకు ఎలిబీ పోతుంది. సుశాంత్‌తో మీ వ్యవహారం వల్ల అనుమానం మీపై పడుతుంది. అందుకని కారులో వేగంగా ఇల్లు చేరారు. ఏమంటారు? " అని అడిగాను.

సునీలలో ఫైటింగ్ స్పిరిట్ పోయింది. తల వంచుకుని, "మీరు గెస్ చేసింది కరెక్టే. రామచందర్ ఎవరికీ హాని తలపెట్టే మనిషి కాదు. ఆ పిస్టల్ కూడా బొమ్మ తుపాకీ. ఊరికే సుశాంత్‌ని భయపెట్టి పారిపోదామనుకున్నారు. అది రామచందర్ స్వభావానికి విరుద్ధం కాబట్టి పరశురామే అది చేసి ఉంటాడని సుశాంత్ నమ్మి, పదిమందికీ చెప్తాడని ఐడియా."

"మరి మీరెందుకు వచ్చారక్కడికి? "

"సుశాంత్‌ని భయపెట్టిన తర్వాత ఆటోలో పారిపోదామని రామచందర్ ప్లాను. సుశాంత్‌ని అతన్ని వెంటాడుతాడుగా. తిరిగి హోటల్‌కి వచ్చేసరికి మా కారు అక్కడ ఉండకూడదు. అప్పుడే రామచందర్ మీటింగులో నుండి బయటకు వచ్చి కారు తీసుకుని ఇంటికి వెళ్లిపోయి ఉంటాడని అతను నమ్ముతాడు. అందుకని నేను ఆటోలో హోటల్ చేరి ఓ మూలగా దాక్కున్నాను. రామచందర్, సుశాంత్ అలా వెళ్లగా చూసి కారు వేసుకుని వచ్చేయడానికి..."

"మీ ఇద్దరూ కలిసి వేసిన ప్లానులో సుశాంత్‌ని ఎందుకు ఇరికించారు? "

"సుశాంత్ నాకు ఫ్రెండయిన సంగతి ఆయనకు తెలుసు. అప్పటికతను లా స్టూడెంటు. ఈ ప్లాను ఐడియా వచ్చాక, అతన్ని డిటెక్టివ్ చేస్తే అతని సర్టిఫికెట్‌కి విలువ వస్తుందని అనుకున్నాం. సుశాంత్‌తో ఉన్న సాన్నిహిత్యం వల్ల అతని ఆలోచనా ధోరణిని మాకు అనువుగా ఉండేటట్టు చూడగలమని నా ధీమా. డిటెక్టివ్‌ని చేయడానికి చిన్న కంపెనీ ఏది ఉందా అని వెతికితే మీది కనబడింది. కానీ ఇంకొకరికి జీతం ఇచ్చే పరిస్థితిలో లేనని మీరనడంతో, అతన్ని పార్టనర్‌గా చేరమని మేమే డబ్బిచ్చాం!"

"అంతా బాగానే ప్లాన్ చేశారు కానీ, చిన్న డిటెక్టివ్ కంపెనీ యజమానికి పెద్ద బుర్ర ఉంటుందని ఊహించలేకపోయారు. ఏది ఏమైనా మీరు వచ్చి జరిగింది చెప్పేయుండి! అప్పుడు కానీ సుశాంత్ బయటకు రాడు!" అన్నాను.

సునీల తల ఊపింది.

■

